## క్లుప్తంగా

### పోలేరమ్మకు రథం బహూకరణ



రథానికి ప్రత్యేక పూజలు చేస్తున్న పూజారులు, అధికారులు

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలో కనుమ పోలేరమ్మకు బళ్లారికి చెందిన భీమినేని చిన్న ఈశ్వరయ్య కుమారుడు కాశీనీయుడు కుటుంబ సభ్యులు ఉత్సవ రథం వితరణ చేసినట్లు మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు. సోమవారం నూతన రథానికి బ్రహ్మంగారిగుడి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మ గుడిలో ఇకపై జరిగే ఉత్సవాలకు అమ్మవారిని కొత్త రథంపై ఊరేగించడం జరుగుతుందని మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు.

### నివాళి



యంగటమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధా

అట్లూరు : మండల పరిధిలోని ముగ్గురి మృతదేహాలకు బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. కమలకూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచు లేవాకు రామసుబ్బారెడ్డి(85) అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. అలాగే అట్లూరు క్రాస్ రోడ్డులోని ఈరి గోపాలయ్య(65) అనారోగ్యంతో మృతి చెందాడు. నల్లగొండుగారిపల్లి కాలనీకి చెందిన పాగడతోటి యంగటమ్మ(80) మృతి చెందారు. వారి మృతదేహాలను ఎమ్మెల్యే సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనరు మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, పెంచల్ రెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పరామర్శ**

మండల పరిధిలోని వరికుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణరెడ్డిని బద్వేలు ఎమ్మెల్యే డాక్టరు సుధా పరామర్శించారు. నారాయణరెడ్డి కాలికి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆయనతో ఎమ్మెల్యే మాట్లాడి ఆరోగ్యంపై ఆరా తీశారు. అధైర్య పడొద్దని, అన్ని విధాలా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట గజ్జల నరసారెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉక్కు పరిశ్రమ కోసం పోరు



ఎన్నికైన డీవైఎఫ్‌ఐ నూతన కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : రాయలసీమకు సంజీవని లాంటి కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు చేస్తామని డీవైఎఫ్‌ఐ మాజీ నాయకుడు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి వి.శివకుమార్ తెలిపారు. సోమవారం స్థానిక డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీవైఎఫ్‌ఐ నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా మేరి కుమార్, కార్యదర్శిగా విశ్వనాథ్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, సభ్యులుగా చిన్న, సుబ్బారావు, రమేష్, పక్కీరయ్యలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

### నూతన నియామకం



వెంకటేశ్వర్లు

మైదుకూరు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మైదుకూరు తాలుకా అధ్యక్షుడిగా మైదుకూరుకు చెందిన దండు నారమ్మ గారి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జెడ్పీ మీటింగ్ హాల్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు వెంకటేశ్వర్లు మైదుకూరులో విలేకరులకు తెలిపారు. మండలంలోని వనిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర్లును మైదుకూరుకు చెందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు తాలుకా సభ్యులు పాల్గొన్నారు.

### మళ్లీ ప్రారంభమైన సర్వే

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమం కింద చౌడూరు గ్రామంలో సోమవారం నుంచి రెవెన్యూ అధికారులు రీ సర్వేని ప్రారంభించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలోని కల్లూరు, కామనూరు, ఉప్పరపల్లె, ఎర్రగుంట్లపల్లె, దొరసానిపల్లె, సర్విరెడ్డిపల్లె రెవెన్యూ గ్రామ పొలాల్లో రీ సర్వే పూర్తయింది. మిగిలిన గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ గంగయ్య, డివిజనల్ సర్వేయర్ వెంకటేశ్వర్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్, మండల సర్వేయర్ వెంకటలక్ష్మి చౌడూరులోని 701 సర్వే నంబర్లలోని 3679 ఎకరాల పట్టా భూములపై, 1006 ఎకరాల ప్రభుత్వ భూములపై రెండు రోవర్లతో రీసర్వే ప్రక్రియను చేపట్టారు. రోజుకు ఒక్కొక్క టీం 20 ఎకరాల చొప్పున చౌడూరు రెవెన్యూ గ్రామాన్ని 165 రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

# యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

- ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ
- వంక, కుంట పొరంబోకులను వదలని వైనం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



పి.పి.కుంట వంక పొరంబోకు భూమిలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు

గోపవరం : ఖాళీగా ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా.. వెంటనే గుడిసెలు వేయడం, అక్రమ కట్టడాలు కట్టడం పరిపాటిగా మారింది. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో రోజురోజుకు భూ ఆక్రమణలు పెరిగి పోతున్నాయి. మండలంలోని బేతాయపల్లె గ్రామ పంచాయతీ పి.పి.కుంట జాతీయ రహదారి పక్కనే గోపవరం రెవెన్యూ పొలం–2 సర్వే నంబర్ 1562లో గతంలో జగనన్న కాలనీకి స్థలాన్ని కేటాయించారు. ఇల్లు లేని నిరుపేదలు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా.. 70 మందికి పైగా గత ప్రభుత్వంలో పట్టాలు మంజూరయ్యాయి. ఇచ్చిన పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఇంతలో సీపీఐ నాయకులు పేదలను రెచ్చగొట్టి లబ్ధిదారులకు స్థలాలు కేటాయించిన స్థలంలో గుడిసెలు వేయించారు. వీరంతా స్థానికేతరులు. పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ స్థలాలు తమకు కేటాయించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ విషయంపై పట్టాలు పొందిన లబ్ధిదారులు అప్పటి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే జగనన్న కాలనీలో వేసిన గుడిసెలను తొలగించాలని స్థానిక అప్పటి రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కానీ ఇప్పటి వరకు గుడిసెలు తొలగించే విషయంలో రెవెన్యూ అధికారులు గానీ, పోలీసులు గానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అలాగే అదే సర్వే నంబరులోని వంక పొరంబోకులో ఆక్రమించిన భూమిని కొందరికి రెండు సెంట్ల చొప్పున సంబంధిత నాయకులు కేటాయించడంతో వారు పక్కా ఇళ్లు కూడా నిర్మించుకుంటున్నారు. రోజురోజుకు ఈ అక్రమ కట్టడాలు మితిమీరి పోతున్నాయి.

**రెవెన్యూ అధికారుల తీరుపై విమర్శలు**

కనీసం అక్రమ కట్టడాలను ఆపాలన్న ప్రయత్నం కూడా రెవెన్యూ అధికారులు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. పట్టాలు ఉండి ఇళ్లు కట్టుకోవాలన్నా తమ అనుమతి లేనిదే నిర్మించకూడదని రెవెన్యూ, బద్వేలు మున్సిపాలిటీ అధికారులు హుకుం జారీ చేశారు. ఇటీవల అనుమతి లేకుండా నిర్మించిన ఇళ్లను కూడా కూల్చివేసిన సంఘటనలు ఉన్నాయి. మరి ఎలాంటి పట్టాలు లేకుండా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. బద్వేలు, గోపవరం రెవెన్యూ పరిధిలో అధిక శాతం ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి గుడిసెలు వేసుకోవడం, ఆ తర్వాత పక్కా ఇళ్లు నిర్మించుకోవడం, వాటిని క్రయవిక్రయాలు జరుపుకోవడం పరిపాటిగా మారింది. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమ కట్టడాలను నిర్మించే వారిపై కొరడా ఝుళిపించాల్సిన అధికారులు.. ఆ పని చేయకుండా పట్టాలు ఉన్నా, వివాదాస్పదంగా ఉన్న వారి విషయంలో మాత్రం మితిమీరి అటు రెవెన్యూ ఇటు పోలీసు శాఖ వారు జోక్యం చేసుకుంటున్నారంటే వారికి రెండు పక్కల ముడుపులు అందుతున్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పటికే కడప – నెల్లూరు సరిహద్దులో, కుంట పొరంబోకు, జగనన్న లేఅవుట్‌లో వందల సంఖ్యలో స్థానికేతరులు గుడిసెలు వేసుకుని ఉన్నారు. రెవెన్యూ అధికారులు ఆదిలోనే స్పందించి ఉంటే పరిస్థితి ఇంత వరకు వచ్చేది కాదు. జగనన్న కాలనీలో పట్టాలు పొందిన లబ్ధిదారులు తమకు స్థలాలు కేటాయిస్తారో లేదో అన్న ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికైనా అక్రమంగా వేసిన గుడిసెలతోపాటు అక్రమ కట్టడాలను కూడా తొలగించి పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాల్సిన అవసరం సంబంధిత అధికారులపై ఉంది.

**పోలీసు ప్రొటెక్షన్ కల్పిస్తే.. తొలగిస్తాం**

ఈ విషయంపై తహసీల్దారు త్రిభువన్‌రెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా.. వంక, కుంట పొరంబోకులో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ నుంచి కూడా లిఖిత పూర్వకంగా అక్రమ కట్టడాలు తొలగించాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. కానీ అక్రమ కట్టడాలను తొలగించాలంటే తగినంత పోలీసు ప్రొటెక్షన్ కావాల్సి ఉందని, ఈ మేరకు జిల్లా ఎస్పీకి కూడా రాత పూర్వకంగా ప్రొటెక్షన్ కావాలని తెలియజేశామని, అయినప్పటికీ ఇప్పటి వరకు వారి నుంచి ఎలాంటి అనుమతి లభించలేదని, పోలీసు ప్రొటెక్షన్ వచ్చిన వెంటనే అక్రమ కట్టడాలను తొలగిస్తామని వివరించారు.

## మా స్థలం మాకు కేటాయించండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

గోపవరం : మండలంలోని బేతాయపల్లె గ్రామ పంచాయతీ పరిధి పి.పి.కుంట జగనన్నకాలనీలో గత ప్రభుత్వం తమకు కేటాయించిన స్థలాలను తమకే ఇవ్వాలని లబ్ధిదారులు సోమవారం బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, తహసీల్దారు త్రిభువన్‌రెడ్డికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. గోపవరం రెవెన్యూ పొలం–2 1562 సర్వేనెంబరులో గత ప్రభుత్వం జగనన్న లేవుట్‌ను ఏర్పాటు చేశారు. ఈ లేఅవుట్‌లో మొదటి విడతలో 12 మందికి లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. అప్పట్లోనే ఆ ఇళ్లు పూర్తి చేయడం జరిగింది. ఇంకా ఇళ్లులేని నిరుపేదలు ఉంటే జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని అప్పటి ప్రభుత్వం చెప్పడం బేతాయపల్లె సచివాలయం పరిధిలోని బేతాయపల్లె, దిన్నెమీదపల్లె, పి.పి.కుంట గ్రామాలకు చెందిన దాదాపు 70 మంది నిరుపేదలు స్థానిక సచివాలయంలో స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగింది. వీరందరికి పట్టాలు మంజూరు చేయడంతోపాటు రిజిస్ట్రేషన్ చేయించారు. ఇంతలో సీపీఐ నాయకులు జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో అక్రమంగా నిరుపేదల చేత గుడిసెలు వేయించారు. అప్పట్లోనే పట్టాలు పొందిన లబ్ధిదారులు వారిని అడ్డుకోవడం జరిగింది. అయినప్పటికీ వారు దౌర్జన్యంగా గుడిసెలు వేసుకున్నారు. రెవెన్యూ అధికారులు గుడిసెలు తొలగించేందుకు వెళ్లగా వారిపై ఆక్రమణదారులు దాడికి దిగడంతో అధికారులు వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత అక్రమంగా గుడిసెలు వేసిన వారి జోలికి ఎవరూ పోలేదు. దీంతో పట్టాలు పొందిన లబ్ధిదారులు గుడిసెలు తొలగించి తమకు స్థలాలు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కూడా ఆశ్రయించారు. వెంటనే గుడిసెలు తొలగించి లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు వారికి స్థలాలు కేటాయించలేదు. దీంతో సోమవారం బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, తహసీల్దారు త్రిభువన్‌రెడ్డికి లబ్ధిదారులు వినతిపత్రాలు అందజేశారు. వెంటనే అక్రమంగా వేసిన గుడిసెలను తొలగించి స్థలాలు కేటాయించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

## దివ్యాంగుల పింఛన్లపై విచారణ



మంచానికే పరిమితమైన వికలాంగుడిని విచారణ చేస్తున్న వైద్య బృందం

ప్రొద్దుటూరు రూరల్ : 85 శాతంపైగా వికలత్వం ఉండి మంచానికే పరిమితమై ప్రభుత్వం ద్వారా రూ.15 వేలు పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల గురించి సోమవారం వైద్యాధికారుల బృందం విచారణ చేపట్టారు. మండలంలోని కొత్తపల్లె, తాళ్లమాపురం, ఉప్పరపల్లె, కల్లూరు, నంగనూరుపల్లె గ్రామాల్లో బద్వేలుకు చెందిన డాక్టర్ వెంకటభరత్, కడపకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బిల్లావత్ సూర్యానాయక్, కామనూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మహాలక్ష్మి, డిజిటల్ అసిస్టెంట్ జశ్వంత్‌కుమార్‌రెడ్డి బృందం పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై విచారణ చేశారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో మొత్తం 34 మంది పంచానికే పరిమితమైన పింఛన్‌దారులు ఉండగా 24 మందిని సోమవారం విచారణ చేశారు. మిగిలిన దొరసానిపల్లె, గోపవరం, పెద్దశెట్టిపల్లె, సోములవారిపల్లె గ్రామ పంచాయతీల్లోని పది మందిని మంగళవారం విచారణ చేయనున్నారు. ప్రభుత్వం మంచానికే పరిమితమైన పింఛన్‌దారులకు రూ.15 వేలు ఇవ్వలేక, వారి వికలత్వ సర్టిఫికెట్‌లోని పర్సెంటేజిని తగ్గించి వారిని రూ.6 వేలు పింఛన్‌దారులుగా కుదింపు చేసేందుకే ఈ విచారణ చేపట్టారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## 27 నుంచి సీపీఐ శిక్షణ తరగతులు

పోరుమామిళ్ల : బద్వేలులో ఈ నెల 27, 28, 29 తేదీల్లో సీపీఐ శిక్షణ తరగతులు జరుగుతాయని ఆ పార్టీ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, కేశవ తెలిపారు. శిక్షణకు సంబంధించిన కరపత్రాలు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ, సైద్ధాంతిక అంశాలపై మూడు రోజులు శిక్షణ ఉంటుందన్నారు. పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల బాధ్యులు శిక్షణలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చెన్నయ్య, సఫా, పీరయ్య, నరసింహులు, వెంకటసుబ్బయ్య, చంద్ర పాల్గొన్నారు.


## జేసీకి డీలర్ ఫిర్యాదు

చాపాడు : నిత్యావసర సరకుల పంపిణీలో ఎలాంటి తప్పు చేయకున్నా తనను రెవెన్యూ అధికారులు సస్పెండ్ చేశారని మండలంలోని చిన్నగురువళూరుకు చెందిన రేషన్ డీలర్ జె.గురువయ్య సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీ అదితి సింగ్‌కు ఫిర్యాదు చేశాడు. గత నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున, చాపాడు మండల రెవెన్యూ అధికారులు చౌక దుకాణం పరిశీలనకు వచ్చారని, ఈ సందర్భంగా పంపిణీ చేయాల్సి ఉన్న సరకులు ఉన్నప్పటికీ తనపై తప్పుడు చర్యలు తీసుకున్నారన్నారు. ఆర్డీఓ సాయిశ్రీ వద్దకు విచారణకు వెళ్లి అన్ని వివరాలు తెలియజేశానని, అయినప్పటికీ తనను సస్పెండు చేశారన్నారు. తనకు న్యాయం చేసి తన కుటుంబ పోషణకు ఆధారమైన చౌక దుకాణ డీలర్‌గా కొనసాగించాలని జేసీని కోరినట్లు బాధితుడు గురువయ్య తెలిపారు.

## ఉపాధి కూలీలకు పని కల్పించాలి

చాపాడు : మండలంలోని ఉపాధి కూలీలకు పని కల్పించాలని మండల అభివృద్ధి అధికారి వీరకిషోర్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీఓ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండల వ్యాప్తంగా వ్యవసాయ పనులు ముగిశాయని, దీంతో కూలీలకు పనులు అందుబాటులో లేవన్నారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పని కల్పించాలని సూచించారు. ప్రస్తుతం మండల పరిధిలో 60 మంది మాత్రమే ఉపాధి పని పొందుతున్నారని, ఈ వారంలో కూలీల సంఖ్య 300లకు చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఈసీ రాజా, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రులకు అప్పగింత



తల్లిదండ్రులకు చిన్నారిని అప్పగిస్తున్న పోలీసులు

బద్వేలు అర్బన్ : తప్పిపోయిన ఓ చిన్నారిని బద్వేలు అర్బన్ పోలీసులు గంట వ్యవధిలోనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణంలోని కోటవీధికి చెందిన ఎం.శ్రీహరి కుమారుడైన మోదుగల లక్ష్మీనరసింహ అనే మూడు సంవత్సరాల బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. తల్లిదండ్రులు హుటాహుటిన అర్బన్ పోలీసులను ఆశ్రయించారు. వెంటనే అప్రమత్తమైన సీఐ రాజగోపాల్, అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ తమ సిబ్బందితో పరిసర ప్రాంతాల్లో గాలించి బాలుడి ఆచూకీని గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి బాలుడిని అప్పగించారు. తమ కుమారుడిని గంట వ్యవధిలోనే అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

బద్వేలు అర్బన్ : మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై చర్యలు తప్పవని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించి బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. తెలిసి తెలియని వయస్సులో ఏదైనా ప్రమాదం జరిగితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు.

## పద్మశాలి ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలి



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంక్షేమ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు : పద్మశాలి ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజినీర్లు, ఇతర ఉద్యోగులందరూ సంఘంలో చేరి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. పద్మశాలి కల్యాణ మండపం అధ్యక్షుడు అవ్వారు తాండవ కృష్ణ మాట్లాడుతూ సంఘం సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. పద్మశాలి కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి మాట్లాడుతూ అన్ని శాఖల సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోము జ్ఞానశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ చుప్పల విజయకుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు రాటాల గోపి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వద్ది మాధవ, హోమియోపతి డాక్టర్ మునిరాంప్రసాద్, సోమా శ్రీనివాసులు, తిరులమకొండు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, అధ్యాపకులు, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఇంటింటి చెత్త సేకరణ తప్పనిసరి

ప్రొద్దుటూరు : ఇంటింటి చెత్త సేకరణ పూర్తి స్థాయిలో అమలు చేయాలని వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలను మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున ఆదేశించారు. సోమవారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో కమిషనర్ పర్యటించారు. స్థానిక జార్జి కారొనేషన్ క్లబ్ వద్ద కాలువలో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికులచే ఆయన తొలగింపజేశారు. గోపి రైస్ మిల్ రోడ్డు, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ గురించి అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోవిందరెడ్డి, నూర్‌బాషా పాల్గొన్నారు.

## రహదారి భద్రత.. అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ హేమకుమార్

ప్రొద్దుటూరు క్రైం : రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ హేమకుమార్ తెలిపారు. ప్రొద్దుటూరులోని ఆర్టీఓ కార్యాలయంలో సోమవారం 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చిన వారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ చాలా వరకు రహదారి నియమాలు పాటించని వారే రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలు జరగవన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్, ఏఓ కరీముల్లా, ఏఎంవీఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**కంటి పరీక్షలు చేయించుకోవాలి**

బద్వేలు అర్బన్ : వాహన డ్రైవర్లు ప్రతి ఆరు నెలలకొకసారి కంటి సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. స్థానిక ఎంవీఐ కార్యాలయ ఆవరణలో వాహనడ్రైవర్లకు పుష్పగిరి కంటి వైద్యశాల వైద్య నిపుణుల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ కంటిచూపు సమస్యను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పుష్పగిరి కంటి వైద్యశాల యూనిట్ హెడ్ సూర్యప్రకాష్, ఆర్టీసీ డీఎం నిరంజన్, కంటి వైద్యులు వెంకటేశ్వర్లు, సంధ్య, ప్రవళ్లిక, క్యాంప్ కో ఆర్డినేటర్ అమర్‌నాథ్‌రెడ్డి, వివిధ వాహనాల డ్రైవర్లు, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయండి



నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



కాశినాయన మండల నాయకులతో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

అట్లూరు : తమ పదవులకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్‌సీపీ జిల్లా సేవాదళం అధ్యక్షులుగా నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డిని నియమించారు. ఆయన సోమవారం పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి.. శ్రీకాంత్‌రెడ్డిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతల చెరువు సర్పంచు వేణుగోపాల్ యాదవ్, ఉప సర్పంచు రవికుమార్‌రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయినారాయణరెడ్డి, సుబ్బారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

**కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉండండి**

పోరుమామిళ్ల : వివిధ పదవుల్లో ఉన్న పార్టీ నాయకులు ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉండాలని, ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీయాల్సిన సమయం వచ్చిందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సూచించారు. కాశినాయన మండల కన్వీనర్‌గా హనుమంతారెడ్డిని నియమించడంతో ఆయన వంద మందితో వచ్చి సోమవారం రాత్రి ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపి, శాలువా, పూలదండతో సత్కరించారు. హనుమంతారెడ్డిని పదవిలో నియమించడంపై ఆయన్ను ఎమ్మెల్సీ అభినందించారు. తనను నమ్మి పదవి వచ్చేలా చేసిన ఎమ్మెల్సీకి జీవితాంతం రుణపడి ఉంటానని హనుమంతారెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఆదేశాల మేరకు పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హామీలు అమలయ్యే వరకు పార్టీ మండల కన్వీనర్లు పోరాటం చేయాలన్నారు. ప్రజలకు అడ్డగోలు హామీలు ఇచ్చి మాట తప్పారన్నారు. మండల కన్వీనర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, కాశినాయన జడ్పీటీసీ దేవసాని సత్యనారాయణరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు రాజీవ్‌బాషు, సీనియర్ నాయకులు పంగా గురివిరెడ్డి, జిల్లా సెక్రటరి యాక్టివేట్ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, మండల నాయకులు నాగసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, ఆదినారాయణరెడ్డి, జగన్మోహనరెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్ పిచ్చిరెడ్డి, వెంకటరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు సాయి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెత్తకు నిప్పు.. కాలిన చెట్లు



చెత్తకు నిప్పు అంటించడంతో కాలిపోయిన చెట్లు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గతంలో ఉపాధి హామీ పథకం కింద నాటిన మొక్కల పర్యవేక్షణలో అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని మొక్కలు చనిపోగా మరి కొన్ని బతికాయి. బతికిన ఈ మొక్కల పక్కనే గ్రామ పంచాయతీలోని అన్ని గ్రామాల నుంచి తెచ్చిన చెత్తా చెదారాన్ని వేశారు. కార్యాలయ ఆవరణమంతా ఈ చెత్త నిండిపోవడంతో సోమవారం నిప్పు పెట్టగా అక్కడున్న చెట్లు కాలి బూడిదయ్యాయి. ఈ గ్రామ పంచాయతీకి ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి ఇన్‌చార్జి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం కార్యాలయానికి వచ్చే ఆయన పచ్చని చెట్ల మధ్య డంప్ యార్డును తయారు చేసిన విషయాన్ని పట్టించుకోకపోవడం గమనార్హం. చెట్లు కాలిపోయిన విషయంపై ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా కొత్తపల్లె గ్రామ పంచాయతీకి డంప్ యార్డు లేదని, మున్సిపాలిటీకి చెందిన డంప్ యార్డులో చెత్తను తరలించేందుకు అనుమతుల కోసం లేఖ రాశామన్నారు. మున్సిపల్ కౌన్సిల్ అనుమతి రాగానే ఆ చెత్తను డంప్ యార్డుకు తరలిస్తామన్నారు.

## ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషన్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు హోటళ్లను ఆయన తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా హోటళ్లలో ప్లేట్లపై, పార్శిల్‌లకు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుండటం గమనించి సంబంధిత హోటల్ యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని హోటళ్లలో ప్లేట్లపై, ఆహార పదార్థాలు పార్శిల్ చేసే క్రమంలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారని, దీని వలన క్యాన్సర్ కారక రసాయనాలు ఆహార పదార్థాలలోకి చేరి అనారోగ్య సమస్యలు వస్తాయని అన్నారు. ప్లేట్లు, ఆహార పదార్థాలు పార్శిల్ చేయడానికి ప్లాస్టిక్ కవర్లకు బదులుగా విస్తరాకులు గానీ అరటి ఆకులు గానీ వాడాలని సూచించారు.

**26 నుంచి ప్లాస్టిక్ నిషేధం**

ఈ నెల 26వ తేదీ నుంచి పట్టణంలోని అన్ని హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లు, పేపర్ల వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటేషన్ సెక్రటరీలు తమ పరిధిలోని హోటళ్లను తరచూ తనిఖీలు చేస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## క్రాప్ లోన్ ఖాతాదారులకు వరం ఓటీఎస్ విధానం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీజీబీ రీజనల్ మేనేజర్ సుశాంతకుమార్‌స్వారో

బి.కోడూరు : మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పంట రుణాల ఖాతాదారులకు వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) విధానం ఓ వరం లాంటిదని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంతకుమార్‌స్వారో పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన బి.కోడూరులోని ఏపీజీబీ బ్యాంకు ఆవరణలో ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ అనిల్‌కుమార్‌తో కలిసి క్రాప్ లోన్ రెన్యువల్ చేయని మొండి బకాయిలున్న ఖాతాదారులకు ఓటీఎస్ విధానం ద్వారా ఎంత మేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట రుణం తీసుకున్న ఖాతాదారులకు ఇదొక మంచి అవకాశమని, దీనిని మండల పరిధిలోని మొండి బకాయిలు ఉన్న క్రాప్ లోన్ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో ఖాతాదారుడు ఒకవేళ మృతి చెంది ఉంటే అలాంటి వారికి మరింత లబ్ధి చేకూరే అవకాశం ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఏపీఎం సీతారామిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రత్నమయ్య, ఫీల్డ్‌ఆఫీసర్ నాయబ్‌రసూల్, నాయకులు యోగానందరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అప్పులు, ఖర్చులను వివరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న పుత్తా లక్ష్మిరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులను, ఖర్చులను ప్రజలకు మీడియా ద్వారా వివరించాలని ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రొద్దుటూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ గంగయ్యకు ఆయన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో ప్రభుత్వ అప్పుల గురించి వస్తున్న వార్తలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అప్పులకు ప్రజలు వివిధ రకాల పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని చెల్లిస్తోందన్నారు. కావున ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న అప్పులు, ఖర్చులు తెలియాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం పార్టీ నాయకులు నరాల బాలిరెడ్డి, శివరామకృష్ణ, మల్లికార్జునశెట్టి, ప్రతాప్, జగన్‌మోహన్‌రెడ్డి, ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.